2023 పాఠకులకు, ప్రకటన కర్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు 2023

కలెక్టర్‌ను కలిసిన జెడ్పీ సీఈవో

తిరుపతి అర్బన్: జిల్లా పరిషత్ సీఈవో ప్రభాకర్‌రెడ్డి శనివారం తిరుపతి జిల్లా కలెక్టర్‌ను తిరుపతి కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తిరుపతి జిల్లా డీపీవో రాజశేఖర్‌రెడ్డి, డీఎల్‌డీవో సుశీలాదేవి పాల్గొన్నారు.



కలెక్టర్‌ను సత్కరిస్తున్న జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి

రమేష్‌బాబుకు డాక్టరేట్

తిరుచానూరు: ఎస్వీయూ ప్రాశ్చ పరిశోధన విభాగం పరిశోధక విద్యార్థి మద్దెల రమేష్‌బాబుకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన ప్రాశ్చ పరిశోధనా సంస్థ సంచాలకుడు తమటం సురేంద్రరెడ్డి పర్యవేక్షణలో ఏ కల్చరల్ హిస్టరీ ఆఫ్ ది కృష్ణా డిస్ట్రిక్ట్ (బేస్డ్ ఆన్ ఇన్‌స్క్రిప్షన్స్) అనే అంశంపై పరిశోధన చేశారని పేర్కొన్నారు.



2 కిలోల గంజాయి స్వాధీనం

తిరుపతి క్రైమ్: తిరుపతి నగరంలోని రైల్వే కాలనీ సమీపంలో శనివారం 2.520 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ నాగరాజురెడ్డి తెలిపారు. నగరానికి చెందిన మోహన్ బాబు (25), రాజేష్ (27) గంజాయి విక్రయిస్తున్నట్టు సమాచారం అందిందన్నారు. వారిని రైల్వే కాలనీ సమీపంలో అదుపులోకి తీసుకుని పరిశీలించగా 2.520 కిలోల గంజాయి దొరికిందన్నారు. గంజాయిని రాజేష్ విశాఖపట్నం నుంచి తెప్పించినట్లు తెలిసిందన్నారు.

2023 పాఠకులకు, ప్రకటన కర్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు 2023

కోర్టులో ఉన్న భూమి ఆక్రమణకు యత్నం

చంద్రగిరి: కోర్టులో కేసు నడుస్తున్న భూమిని ఆక్రమించడానికి యత్నించిన ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని పనపాకం పంచాయతీ అరిగెలవారిపల్లి చెరువు సమీపంలో సుమారు 30 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. 30 ఏళ్ల క్రితం ఆ భూమి అటవీశాఖకు చెందినదని అటవీ అధికారులు హద్దుల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. రెవెన్యూ అధికారులు ఆ భూమి తమదేనంటూ కోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి కోర్టులో కేసు నడుస్తోంది. ఈ భూమిని ఆక్రమించుకోవడానికి కొంతమంది శనివారం యత్నించారు. టీడీపీకి చెందిన ఓ నాయకుడు జేసీబీ, ట్రాక్టర్లతో భూమిని చదును చేశారు. సమాచారం అందుకున్న పనపాకం అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. వివాదంలో ఉన్న భూమిలో పనులు ఎలా చేస్తారంటూ వారిపై మండిపడ్డారు. ఆక్రమణదారులు తప్పించుకోవడం కోసం.. రోడ్డు మరమ్మతుల కోసం మట్టిని తీసుకుంటున్నట్లు అధికారులను నమ్మించే యత్నం చేశారు. అనంతరం సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం అందించి, మరోసారి ఈ భూమిలోకి అక్రమంగా ప్రవేశిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై డీఆర్‌ఓ చిన్నబాబు మాట్లాడుతూ వివాదంలో ఉన్న భూమిలో గ్రావెల్‌ను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బంది అక్కడికి చేరుకున్నారని తెలిపారు. ఇలాంటివి పునరావృతం కాకుండా స్టేట్‌మెంట్ తీసుకుని పంపించినట్టు పేర్కొన్నారు.







జగనన్న పాలనలో విద్యా విప్లవం


చెర్లోపల్లిలో విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

- విద్యతోనే ఉన్నత స్థానాలు
- విద్యార్థుల ఉన్నతికే ట్యాబ్‌లు
- చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి
- థ్యాంక్యూ జగన్ మామా అంటూ విద్యార్థుల కృతజ్ఞతలు


తిరుచానూరులో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

తిరుపతి రూరల్/తిరుపతి మంగళం /తిరుచానూరు/ రామచంద్రాపురం : చదువుల్లో సమానత్వం తీసుకువచ్చి ఆర్థిక అసమానతలను రూపుమాపేందుకు కృషి చేస్తున్న పరిపాలనా కౌటిల్యుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కొనియాడారు. చంద్రగిరి నియోజకవర్గంలోని తిరుపతి రూరల్, చంద్రగిరి, రామచంద్రాపురం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు శనివారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. రెండు రోజులుగా మొత్తం ఆరు మండలాల్లో 2,382 మంది విద్యార్థులు, 389 మంది ఉపాధ్యాయులకు రూ.8.89 కోట్ల విలువైన 2,771 ట్యాబ్‌లు అందించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ట్యాబ్‌లను అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అన్నారు. పేద విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంచడమే సీఎం లక్ష్యమన్నారు. ఒక్కో విద్యార్థికి రూ.16 వేల విలువైన ట్యాబ్, మరో రూ.16 వేల విలువైన విద్యా నైపుణ్యాలతో కూడిన కంటెంట్‌ను అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు నైపుణ్యాలు సాధించి ప్రపంచ వ్యాప్తంగా రాణించేలా ముందుకు సాగాలని, సీఎం జగన్ ఆలోచనలకు అనుగుణంగా రాబోయే తరాలకు ఆదర్శంగా నిలవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

థ్యాంక్యూ జగన్ మామా

అమ్మ ఒడి పథకంతో ఆత్మీయతను పంచి, నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్ది, ఇంగ్లిషు మీడియం ప్రవేశ పెట్టడమే కాకుండా నేడు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ట్యాబ్‌లను అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మామకు థ్యాంక్యూ అంటూ విద్యార్థులు కేరింతలు కొట్టారు. తమతో ఒక ఫొటో దిగాలని, దానిని ముఖ్యమంత్రికి అందించి తమ కృతజ్ఞతలు చెప్పాలని పలు పాఠశాలల విద్యార్థులు ఎమ్మెల్యే చెవిరెడ్డిని కోరారు. ఆయన పిల్లల మధ్య కూర్చుని ఫొటో దిగారు. కార్యక్రమంలో తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెర్లోపల్లి సర్పంచ్ బొల్లినేని సుభాషిణి, వైఎస్సార్ సీపీ నేతలు వాసుదేవనాయుడు, శుభగిరినాయుడు, చిన్నియాదవ్, మాధవరెడ్డి, దొరస్వామి, హరిత పాల్గొన్నారు.

తిరుచానూరులో..

తిరుచానూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు ట్యాబ్‌లు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. పాఠశాల వద్దకు విచ్చేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డికి స్కౌంట్ హానర్‌తో ఘనంగా సత్కరించి స్కౌంట్ మార్చ్‌తో విద్యార్థులు స్వాగతం పలికారు.అనంతరం తిరుచానూరు పరిధిలోని దామినేడు,దుర్గసముద్రం,ఎంఎస్ కండ్రిగ,ఓటేరు,పద్మావతిపురం, తిరుచానూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు 470 ట్యాబ్‌లను అందజేశారు. తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ నరేష్, శేఖర్, యోగానందరెడ్డి, వైస్ ఎంపీపీ యశోద,వార్డు సభ్యులు మునీంద్ర, వాసు, యోగా పాల్గొన్నారు. రామచంద్రాపురం మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీ భానుకుమార్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈఓ శేఖర్, ఎంఈఓ వెంకటసుబ్బమ్మ, తహసీల్దార్ చిన్న వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ మహ్మద్ రఫీ, తిరుపతి జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రఘునాథరెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దామోదర్‌రెడ్డి తదితరుల పాల్గొన్నారు. మంగళంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, ఎంఈవో ప్రభాకర్‌రాజు, నాయకులు రాంబాబు, గుండ్రాజు శివశంకర్‌రాజు, లక్ష్మీ నారాయణ, అశోక్‌రెడ్డి, మల్లె మొగ్గల ఉమాపతి, బైరెడ్డి రమేష్, హరికృష్ణ, గణేష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆటో స్టాండ్ ఏర్పాటుకు వినతి

చంద్రగిరి: స్థానిక టవర్ క్లాక్ వద్ద ఆటో స్టాండ్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు డ్రైవర్లు వాపోయారు. వారు శనివారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని కలిసి తమ సమస్యను వివరించారు. వారు మాట్లాడుతూ గతంలో ఆటో స్టాండ్ ఉండేదని, రోడ్డు విస్తరణలో తొలగించినట్టు పేర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి సమస్యను పరిష్కరించాలని ఎస్‌ఐ వంశీధర్‌ను ఆదేశించారు.









పారదర్శకంగా సామాన్యులకు శ్రీవారి దర్శనం


మీడియాతో మాట్లాడుతున్న పోకల అశోక్‌కుమార్

తిరుపతి మంగళం : టీటీడీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నూతన సంవత్సరం, వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రోజుల్లో సామాన్య భక్తులకు పెద్ద పీట వేస్తూ పారదర్శకంగా శ్రీవారి దర్శనం కల్పించనున్నట్టు టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ తెలిపారు. ఆయన శనివారం బైరాగిపట్టెడలోని కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గతంలో నూతన సంవత్సరం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల్లో వీఐపీల తాకిడి ఎక్కువగా ఉండేదన్నారు. ఈ సారి వీఐపీ ప్రొటోకాల్, బ్రేక్ దర్శనాలు రద్దు చేసి సామాన్య భక్తులకే ప్రాధాన్యం ఇచ్చినట్టు తెలిపారు. తిరుపతి ప్రజలకు శ్రీవారి దర్శనం కల్పించేందుకు 9 కౌంటర్లను ఏర్పాటు చేసి 7 లక్షల టోకెన్లు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. భక్తులు వారికి కేటాయించిన సమయం ప్రకారమే తిరుమలకు వచ్చి దర్శనం చేసుకోవాలని కోరారు.







దళితుల సంక్షేమానికే సబ్ ప్లాన్ నిధులు


మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప

తిరుపతి కల్చరల్: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టకుండా దళితుల సంక్షేమానికే ఖర్చు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప డిమాండ్ చేశారు. యశోదానగర్‌లోని ఎంబీ భవన్‌లో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరిగాయన్నారు. చట్టాలను కూడా అమలుచేయడం లేదని ఆరోపించారు. ఆర్‌పీఐ రాష్ట్ర నేత పి.అంజయ్య, దళిత హక్కుల పోరాల సమితి నగర కార్యదర్శి కాలయ్య మాట్లాడుతూ ఎన్నికలు వచ్చినప్పుడే దళితులపై రాజకీయ పార్టీలకు ప్రేమ పుట్టుకొస్తుందని తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రమణ్యం, కేవీపీఎస్ జిల్లా నేత ఎండీ.శ్రీనివాసులు, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.సాయిలక్ష్మి, సీపీఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, టీటీడీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పార్థసారథి, మనోహర్ పాల్గొన్నారు.





రచయిత షణ్ముగంకు వన్నూరమ్మ పుస్తకం అందజేత


వి.షణ్ముగంకు పుస్తకం అందజేస్తున్న బొమ్మిశెట్టి రమేష్

తిరుచానూరు: వన్నూరమ్మ.. ఎదురులేని పాలెగత్తే... పుస్తకాన్ని ప్రముఖ రచయిత ఎస్వీ యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ వి.షణ్ముగంకు రచయిత బొమ్మిశెట్టి రమేష్ శనివారం అందజేశారు. షణ్ముగం మాట్లాడుతూ రాయలసీమలో ఏకైక మహిళా పాలెగత్తె వన్నూరమ్మ అని తెలిపారు. 1781 నుంచి 1796 వరకు ఆమె ఎదురులేని పాలెగత్తెగా మట్లి రాజులు, నిజాం నవాబులు, గోల్కొండ నవాబులు, టిప్పు సుల్తాన్, హైదరాలి తదితరుల వెన్నులో వణుకు పుట్టించిందని తెలిపారు. భర్త చిన్న నరసింహనాయుడు మరణానంతరం నల్లమల అటవీ ప్రాంతంలో ఒంటరి పోరాటం సాగించారని పేర్కొన్నారు. వన్నూరమ్మ పత్ర నాయుడు వంశానికి చెందినదని తెలిపారు. ఆమె చరిత్రను రమేష్ ప్రపంచానికి తెలియచేయడం అభినందనీయమన్నారు. యూనివర్సిటీ లైబ్రరీ జూనియర్ అసిస్టెంట్ షేక్ సలీంకు కూడా వనూరమ్మ పుస్తకాన్ని రచయిత అందజేశారు.



2023 పాఠకులకు, ప్రకటన కర్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు 2023

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి

తిరుపతి మంగళం : తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంకు(టౌన్ బ్యాంకు)లో శనివారం 2023 సంవత్సరం క్యాలెండర్‌ను చైర్మన్ కేతం జయ చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ వాసుయాదవ్, ఎండీ ప్రభావతి ఆవిష్కరించారు. కొత్త సంవత్సరం లో తిరుపతి నగర ప్రజలు, బ్యాంకు ఖాతాదారులు ఆర్థికంగా, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పోలిరెడ్డి నాగిరెడ్డి, కాశీమ్, అనీల్‌రాయల్, మబ్బు నాదమునిరెడ్డి, వెంకటేష్‌రాయల్, మాకం చంద్రయ్య, బ్రహ్మానందరెడ్డి, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుచానూరు: ఎస్వీయూనివర్సిటీ-2023 సంవత్సరం క్యాలెండర్‌ను శనివారం ఏపీజీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు మలిది రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ రాజారెడ్డి ఆవిష్కరించారు. జీసీటీఏ జిల్లా నాయకులు సి.వెంకట కృష్ణయ్య, వి.వాసు మాట్లాడుతూ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన శ్రీకాంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.



బీస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పోకల అశోక్ కుమార్

తిరుపతి రూరల్: బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవా సమితి(బీస్) నూతన సంవత్సర క్యాలెండర్‌ను టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ శనివారం ఆవిష్కరించారు. బీస్ జిల్లా అధ్యక్షుడు నీలం నరేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల అశోక్‌కుమార్, రవికుమార్ పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఆలయాలు ముస్తాబు



శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వెంకన్న ఆలయం

తిరుపతి కల్చరల్: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని టీటీడీ స్థానిక ఆలయాల్లో భక్తుల సౌకర్యార్థం విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. అన్ని ఆలయాల్లో ప్రత్యేక క్యూలు, చలువ పందిళ్లు, రంగవల్లులు తీర్చిదిద్ది వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు.

శ్రీనివాస మంగాపురంలో...

చంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేకువ జామున 12.05 నుంచి 2 గంటల వరకు ధనుర్మాస కైంకర్యాలు, తోమాల సేవ, కొలువు, పంచాగ శ్రవణం నిర్వహిస్తారు. వేకువ జామున 2 నుంచి రాత్రి 8.30 గంటల వరకు భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి సందర్భంగా ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసిందని ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి తెలిపారు.

అప్పలాయగుంటలో..

అప్పలాయగుంటలోని శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి నాడు వేకువ జామున 3 నుంచి 4 గంటల వరకు తిరుప్పావైతో స్వామివారిని మేల్కొలిపి ధనుర్మాస కైంకర్యాలు నిర్వహిస్తారు. ఉదయం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు తిరువీధి ఉత్సవం చేపడతారు. 3న వైకుంఠ ద్వాదశి సందర్భంగా ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్నపన తిరుమంజనం, చక్రస్నానం నిర్వహించనున్నారు.

నారాయణవనంలో....

నారాయణవనంలోని శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా వేకువ జామున 2 నుంచి 4 గంటల వరకు తిరుప్పావైతో స్వామిని మేల్కొలిపి ధనుర్మాస కైంకర్యాలు, తోమాల సేవ, కొలువు, పంచాగ శ్రవణం నిర్వహిస్తారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు శ్రీవారి గ్రామోత్సవం, ఆస్థానం చేపడతారు. 3న వైకుంఠ ద్వాదశి సందర్భంగా ఉదయం 8.15 గంటల నుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తారు.

నాగలాపురంలో....

నాగలాపురంలోని శ్రీవేద నారాయణస్వామి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా వేకువజామున 2 నుంచి 4 గంటల వరకు తిరుప్పావైతో స్వామిని మేల్కొలిపి తోమాల సేవ, కొలువు, పంచాగ శ్రవణం, ధనుర్మాస కైంకర్యాలు నిర్వహిస్తారు. ఉదయం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తులకు సర్వదర్శనం కల్పిస్తారు. ఉదయం 10 గంటలకు ఉత్సవర్లకు అభిషేకం, సాయంత్రం 6 నుంచి రాత్రి 7.30 గంటల వరకు తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. అలాగే తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి, శ్రీకోదండ రామాలయం, కార్వేటినగరంలోని వేణుగోపాలస్వామి, చంద్రగిరిలోని కోదండరామాలయం, పిఠాపురంలోని పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి, కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయం, బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నం, అమరావతిలో శ్రీవెంకటేశ్వరస్వామివారి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అమ్మవారి ఆలయంలో..

తిరుచానూరు: పద్మావతి అమ్మవారి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు శ్రీకృష్ణ ముఖ మండపంలో అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం చేపడతారు. 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అమ్మవారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షిస్తారు. ఆలయంలో కల్యాణోత్సవం, బ్రేక్ దర్శనం, అష్టదళ పాద పద్మారాధన సేవలను టీటీడీ రద్దు చేసింది. మంగళవారం ద్వాదశి నాడు ఉదయం 7 నుంచి 9 గంటలకు శ్రీసుదర్శన చక్రతాళ్వార్‌కు తిరుమంజనం, చక్రస్నానం చేస్తారు.

తిమ్మప్ప ఆలయ పునఃనిర్మాణానికి సహకరించాలని వినతి

చంద్రగిరి: తొండవాడ సమీపంలో ఉన్న పురాతన తిమ్మప్ప ఆలయ పునఃనిర్మాణానికి సహకరించాలని తిమ్మప్ప దేవాలయ పునరుద్ధరణ సమితి నాయకులు కోరారు. వారు శనివారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 1,542లో అన్నమయ్య మనువడు చిన్నన్న ఆధ్వర్యంలో ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతోందన్నారు. 1761-82 మధ్య ముస్లింల దండయాత్రలో ఆలయం శిథిలమైందన్నారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యను టీటీడీ దృష్టికి తీసుకెళతానని తెలిపారు. సమితి అధ్యక్షుడు మునిగంగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పాదిరి ధనుంజయ రెడ్డి, నరేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దొడ్ల కిషోర్‌కుమార్‌కు సేవారత్న పురస్కారం



అవార్డు అందుకుంటున్న న్యాయవాది దొడ్ల కిషోర్‌కుమార్

తిరుపతి లీగల్ : సుప్రీం కోర్టు, రాష్ట్ర హైకోర్టు న్యాయవాది దొడ్ల కిషోర్‌కుమార్‌కు ఆల్ ఇండియా అడ్వొకేట్ ఫెడరేషన్ సేవారత్న బిరుదును ప్రదానం చేసింది. చిత్తూరు జిల్లా తవనంపల్లి మండలం కొండ్రాజుకాలువకు చెందిన న్యాయవాది కిషోర్‌కుమార్ 12 ఏళ్లుగా సుప్రీంకోర్టు, రాష్ట్ర హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఆయన చేసిన సేవలను గుర్తించిన ఆల్ ఇండియా అడ్వొకేట్ ఫెడరేషన్ డిసెంబర్ 30న ఢిల్లీలో సేవారత్న పురస్కారాన్ని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేజీ బాలకృష్ణ చేతుల మీదుగా అందజేసింది. ఆయనకు పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి సేవలు మరువలేనివి

– లోక్‌సభ ప్యానల్ స్పీకర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి



శ్రీకాంత్‌రెడ్డిని సత్కరిస్తున్న రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే వెంకటేగౌడ, వీసీ రాజారెడ్డి

తిరుచానూరు: ఎస్వీ యూనివర్సిటీ రెక్టార్, సైకాలజీ విభాగపు ప్రొఫెసర్ వి.శ్రీకాంత్‌రెడ్డి సేవలు మరువలేనివని లోక్‌సభ ప్యానల్ స్పీకర్, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి తెలిపారు. ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి ఎస్వీయూ రెక్టార్‌గా శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను సెనేట్ హాల్‌లో సన్మానించారు. ఇందులో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి విద్యా బోధన, పరిశోధన, విస్తరణ రంగంలో విశేష కృషి చేశారని తెలిపారు. భవిష్యత్‌లోనూ విద్యా రంగానికి ఆయన సేవలు ఎంతో అవసరమన్నారు. ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ కె.రాజారెడ్డి మాట్లాడుతూ శ్రీకాంత్‌రెడ్డి బోధన, పరిశోధన, ప్రిన్సిపాల్, సీడీసీ డీన్, రెక్టార్‌గా విశేష సేవలు అందించారని కొనియాడారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మహ్మద్ హుస్సేన్, ప్రిన్సిపాళ్లు పద్మనాభం, శ్రీనివాసులురెడ్డి, ఓఆర్‌ఐ విభాగం ప్రొఫెసర్ పీసీ.వెంకటేశ్వర్లు, పలమనేరు ఎమ్మెల్యే వెంకటే గౌడ, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నేతలు మురళి, కిషోర్‌దాస్, సుధాకర్, తేజశ్వర్‌రెడ్డి, యూనివర్సిటీ ఉద్యోగ సంఘం నేతలు సుబ్రమణ్యం రెడ్డి, లెక్కల రాజశేఖర్, సుందర్‌రెడ్డి, సిద్దారెడ్డి, జనార్దన్‌రెడ్డి, పాకనాటి హరికృష్ణ, యూనివర్సిటీ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



ఇళ్ల నిర్మాణాలపై ఆరాతీస్తున్న కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి తుడా: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి అధికారులను ఆదేశించారు. ఆమె శనివారం జీపాళెం వద్ద నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సకాలంలో పనులు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జీ పాళెంలో ఇళ్ల నిర్మాణాలకు ముందుకొచ్చిన లబ్ధిదారుల సహకారంతో ఇరవై ఇళ్లను గృహ ప్రవేశాలకు సిద్ధం చేస్తున్నట్లు డీఈ మహేష్ కమిషనర్‌కు వివరించారు. అదేవిధంగా సుమారు వంద ఇళ్ల స్థలాల్లో లీగల్ ఇబ్బందులు రావడంతో వారికి ఆ లేఅవుట్లలోనే సర్వే చేసి కొత్తగా ప్లాట్లు కేటాయించినట్టు తెలిపారు. హౌసింగ్ సిబ్బంది, సెక్రటరీలు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన నూతన సంబరాలు

తిరుపతి కల్చరల్: 2022కు వీడ్కోలు పలుకుతూ 2023 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ శనివారం రాత్రి యువకులు తిరుపతి నగరంలో సంబరాలు జరుపుకున్నారు. స్వీట్ స్టాల్స్, బేకరీస్‌లో కేక్‌ల కొనుగోళ్లతో సందడి చేశారు. రామానాయుడు కల్యాణ మండపం, శిల్పారామం, గ్రాండ్ రిడ్జి, రోబో రెస్టారెంట్, మినర్వా, మానస సరోవర్ వంటి ప్రాంతాలు, విద్యాసంస్థల్లో కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆనందం పంచుకున్నారు. కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లలో కొత్త సంవత్సరం సందర్భంగా ప్రత్యేకంగా పాశ్చాత్య డీజే, సంప్రదాయ నృత్యాలతో యువతీ యువకులు కేరింతలు కొట్టారు. గాయనీ గాయకులు యువళ గీతాలతో అలరించారు. పలు ప్రాంతాల్లో యువకులు రోడ్లపై కేక్‌లు కట్ చేసి హ్యాపీ న్యూయర్ అంటూ సంబరాలు జరుపుకున్నారు.



నూతన సంవత్సరం సందర్భంగా కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న తీర్థకట్ట వీధిలోని దుకాణాలు..



నూతన సంవత్సరం సందర్భంగా ఇందిరా ప్రియదర్శిని మార్కెట్‌లో కొనుగోలుదారుల సందడి.. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి